సాక్షి
పశ్చిమగోదావరి

బుధవారం । 3 । సెప్టెంబర్ । 2025



వైఎస్ చలవతో..

ఏలూరు దుఃఖదాయినిగా పిలిచే తమ్మిలేరు వరద సమస్యకు మహానేత వైఎస్సార్ పరిష్కారం చూపారు. తమ్మిలేరు రక్షణ గోడ వైఎస్సార్ చలవే.. 8లో ▸



మావుళ్లమ్మ సన్నిధిలో ఆర్టీసీ ఎండీ

భీమవరం (ప్రకాశంచౌక్): మావుళ్లమ్మను ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు దంపతులు దర్శించుకున్నారు. అర్చకులు, వేదపండితులు ఆశీర్వచనం అందజేశారు.



వైద్యం వికటించి మృతి

ఆర్ఎంపీ వైద్యుడి నిర్వాకంతో వైద్యం వికటించి ఒక యువతి మృతిచెందింది. దీంతో మృతురాలి బంధువులు వైద్యుడి క్లినిక్ వద్ద ఆందోళనకు దిగారు. 8లో ▸

న్యూస్‌రీల్

సాక్షి ఎడిటర్‌పై కేసు సరికాదు

ఐజేయు సెక్రటరీ సోమసుందర్

తాడేపల్లిగూడెం: 'సాక్షి' ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డిపై కేసు నమోదు చేయడం సరికాదని ఇండియన్ జర్నలిస్టుల యూనియన్ (ఐజేయూ) కార్యదర్శి దూసనపూడి సోమసుందర్ అన్నారు. ఈ అంశంపై మంగళవారం ఆయన స్పందిస్తూ.. ఏదైనా విషయంపై పత్రికలో రాసిన వార్త విషయంలో అభ్యంతరాలు ఉంటే.. ప్రభుత్వం దానికి వివరణ కోరాలన్నారు. అంతేగానీ కేసు నమోదు చేయడం సరైన విధానం కాదన్నారు. ఇది విష సంస్కృతికి పునాది అని చెప్పారు. కథనాలపై వివరణలు ఇచ్చినా, సంబంధిత బాధ్యులు స్పందించకపోతే ప్రభుత్వం స్పందించవచ్చని, మళ్లీ వివరణ కోరవచ్చని తెలిపారు. ఇలాంటి విధానాలు మంచిది కాదన్నారు.

విద్యారంగ సమస్యలపై చలో విజయవాడ



చలో విజయవాడ పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం: విద్యారంగంలో సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈనెల 6న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు బి.గణేష్ చెప్పారు. పట్టణంలోని సీఎస్ఎన్ కళాశాల వద్ద చలో విజయవాడ పోస్టర్ ఆవిష్కరణ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యాసంస్థలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పూర్తిస్థాయిలో చెల్లించకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎన్నికల సమయంలో యువగళం పాదయాత్ర నిర్వహించిన నారా లోకేష్ అధికారంలోకి వస్తే 100 రోజుల్లోనే విద్యారంగ సమస్యలన్నీ పరిష్కరిస్తామని చెప్పి.. నేటికీ ఒక్కటీ అమలు చేయకపోవడం దారుణమన్నారు. పీజీ స్కాలర్‌షిప్‌లు జీవో నెంబర్ 77 రద్దు, వసతి గృహాల్లోని సమస్యల పరిష్కారం, హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీల పెంపు వంటి అనేక సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు సాయికృష్ణ, ఉపాధ్యక్షుడు సాయితేజ తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

భీమవరం: జిల్లాలో ఎరువులకు కృత్రిమ కొరత సృష్టించి రైతులను మోసం చేయాలని చూస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఎరువుల డీలర్లు, వ్యాపారులు కృత్రిమ ఎరువుల కొరత సృష్టిస్తే అవసరమైతే పీడీ యాక్ట్ కింద చర్యలు తీసుకోవడానికి వెనకాడబోమన్నారు. జిల్లాలో వ్యవసాయం ఊపందుకున్న నేపథ్యంలో కొంత మంది వ్యాపారులు ఎరువుల కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని రైతులను బ్లాక్ మార్కెట్ నుంచి రక్షించడానికి, ఎరువుల సరఫరాలో పారదర్శకతను పెంచడానికి జిల్లా పోలీసు యంత్రాంగం వ్యవసాయ, ఇతర అనుబంధ శాఖల సమన్వయంతో పని చేసి చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తామన్నారు. ఎరువులను ప్రభుత్వం నిర్దేశించిన ధరకు మించి విక్రయిస్తే దుకాణాలను తక్షణమే సీజ్ చేయడంతో పాటు డీలర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఎన్టీఆర్ వైద్య సేవల్లో అక్రమాలపై చర్యలు

భీమవరం (ప్రకాశంచౌక్): ఎన్టీఆర్ వైద్య సేవల్లో డబ్బులు తీసుకున్నట్లు రుజువైతే పెద్ద మొత్తంలో పెనాల్టీతోపాటు, రిజిస్ట్రేషన్ రద్దుకు కూడా వెనుకాడేది లేదని కలెక్టర్ చదలవాడ నాగరాణి హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన పలు ఆసుపత్రులపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేశారు. 16 ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులపై ఆరోపణలు రాగా వాటిలో భీమవరం ఒమెగా హాస్పిటల్, రాజర్షి హాస్పిటల్, శ్రీ లక్ష్మి హాస్పిటల్, తణుకు యాపిల్ హాస్పిటల్, తణుకు ప్రభుత్వ జిల్లా హాస్పిటల్, వర్మ హాస్పిటల్ ఉన్నాయి. లక్ష్మి హాస్పిటల్, మదర్ వన్నిని హాస్పిటల్‌పై ఫిర్యాదులు రుజువు అయినందున పెనాల్టీ విధించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ సేవల విఘాతం కలిగించేలా కొన్ని ఆసుపత్రుల యాజమాన్యాలు వ్యవహరిస్తున్నాయన్నారు. ఎక్కడైనా వైద్య సేవలో డబ్బులు వసూలు చేస్తే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని గట్టిగా హెచ్చరించారు.

విధుల బహిష్కరణ

కై కలూరు: న్యాయవాదులపై అక్రమ కేసులు బనాయింపును నిరసిస్తూ కై కలూరు బార్ అసోషియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మంగళవారం విధులను బహిష్కరించి నినాదాలు చేశారు. బార్ అసోషియేషన్ అధ్యక్షుడు గురజాడ ఉదయశంకర్ మాట్లాడుతూ బాపట్ల, నందిగామలో న్యాయవాదులపై పోలీసులు అక్రమ కేసులు బనాయించారన్నారు.



భీమవరం శ్రీనివాస సెంటర్‌లో పేదలకు అన్నదానం చేస్తున్న మండలి చైర్మన్ మోషేనురాజు, భీమవరం ఇన్‌చార్జ్ వెంకటరాయుడు తదితరులు



తాడేపల్లిగూడెంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



పాలకొల్లు 25వ వార్డులో చీరలు పంపిణీ చేస్తున్న గుడాల గోపి, గూడూరి ఉమాబాల తదితరులు

జోహార్.. రాజన్నా

రైతుకు తోడుగా, నిరుపేదకు నీడగా, ఆడపడుచులకు అండగా, యువతకు దార్శనికుడిగా, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఆపద్బాంధవుడిగా, పేద విద్యార్థుల ఉన్నత చదవులకు పెద్దదిక్కుగా జనరంజక పాలన సాగించిన రాజన్నకు జిల్లా ప్రజలు జోహార్లు పలికారు. మహానేత దివికేగి 16 ఏళ్లు గడిచినా గుండె గూటిలో ఆయన జ్ఞాపకాలు ఎప్పటికీ పదిలంగానే ఉంటాయని చాటిచెప్పారు. జోహార్ వైఎస్సార్.. అంటూ నినదించారు.

- వాడవాడలా వైఎస్ వర్ధంతి
- నివాళులర్పించిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు
- విస్తృతంగా సేవా కార్యక్రమాలు
- వైఎస్‌తో అనుబంధం, ఆయన చేసిన మేలు గుర్తు చేసుకున్న నేతలు

సాక్షి, భీమవరం: జిల్లా వ్యాప్తంగా మంగళవారం వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నేతలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌తో అనుబంధాన్ని, ఆయన చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నేతలు గుర్తుచేసుకున్నారు.

వైఎస్సార్ పాలనలో సంక్షేమం కొత్త పుంతలు

భీమవరంలోని గునుపూడిలో వైఎస్ విగ్రహానికి శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ చినమిల్లి వెంకటరాయుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మోషేన్‌రాజు మాట్లాడుతూ వైఎస్సార్ పాలనలో ఉమ్మడి రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొత్తపుంతలు తొక్కిందన్నారు. ఆయన అమలుచేసిన ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇందిరమ్మ ఇళ్లు తదితర పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపాయని కొనియడారు. జిల్లా మహిళా అధ్యక్షురాలు కోడే విజయలక్ష్మి, యుగంధర్ దంపతులు శ్రీనివాస సెంటర్ వద్ద పేదలకు అన్నదానం చేశారు.

- ఆచంటలో మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథ రాజు వైఎస్‌కు నివాళులర్పించారు. పేదలకు పండ్లు పంచారు. ఆచంట, పెనుమంట్ర, పెనుగొండ మండలాల్లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.
- ఉండి నియోజకవర్గ కోఆర్డినేటర్ పీవీఎల్ నరసింహరాజు వైఎస్సార్‌కు నివాళులర్పించారు. ఆకివీడు వైఎస్సార్ సెంటర్‌లో 200 మంది పేదలకు దుప్పట్లు, ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు వేగేశ్న వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.
- పాలకొల్లు గాంధీ బొమ్మల సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ గుడాల శ్రీహరిగోపాలరావు, మహిళ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గూడూరి ఉమాబాల, నేతలు యడ్ల తాతాజీ, చెల్లెం ఆనందప్రకాష్ తదితరులు నివాళులర్పించారు. పార్టీ కార్యాలయం వద్ద పేదలకు దుప్పట్లు, పులిహోర పంపిణీ చేశారు.
- నరసాపురంలోని స్టీమర్ రోడ్డులో వైఎస్సార్ విగ్రహానికి పార్టీ సీజీసీ సభ్యుడు పీడీ రాజు, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ బంధన పూర్ణచంద్రరావు, జెడ్పీటీసీ సభ్యులు తిరుమాని బాపూజీ, బొక్కా రాధాకృష్ణ తదితరులు నివాళులర్పించారు.
- తణుకు పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి ఆధ్వర్యంలో వైఎస్ఆర్ విగ్రహాలకు పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇరగవరం, అత్తిలి, తణుకు రూరల్ మండలాల్లో పార్టీ శ్రేణులు వైఎస్ వర్ధంతి నిర్వహించారు.



తణుకు రాష్ట్రపతి రోడ్డులో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పార్టీ శ్రేణులు

ఆరోగ్య శ్రీ పథకం దేశానికే ఆదర్శం

తాడేపల్లిగూడెంలోని పోలీస్ ఐలాండ్ సెంటర్‌లో పార్టీ శ్రేణులతో కలిసి వైఎస్సార్ విగ్రహానికి మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ ఘనంగా నివాళులర్పించారు. పేదలకు పండ్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా కొట్టు మాట్లాడుతూ వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఆరోగ్య శ్రీ పథకాన్ని దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో అమలుకు కేంద్రం యోచిస్తుందన్నారు. 108 సేవలు ఎన్నో రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. 2004లో ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం తాడేపల్లిగూడెం నియోజకవర్గ అభివృద్ధికి వైఎస్ రాజశేఖరరెడ్డి అందించిన సహకారం మర్చిపోలేదన్నారు. పట్టణ మాజీ అధ్యక్షుడు గుండుబోగుల నాగు ఆధ్వర్యంలో పడాలలోని ఏఎంసీ వద్ద మహిళలకు చీరలు అందజేశారు.



పెదఅమిరంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించిన ఇన్‌చార్జ్ పీవీఎల్ నరసింహరాజు



నరసాపురంలో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న పార్టీ కేంద్ర పాలకమండలి సభ్యుడు పీడీ రాజు



ఆచంటలో వైఎస్సార్ విగ్రహం వద్ద ఘనంగా నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు

సైబర్ మోసం.. రూ.93 లక్షలు స్వాహా

ఆకివీడు: సైబర్ మోసం కేసులో ఆకివీడు చెందిన విశ్రాంతి ప్రధానోపాధ్యాయురాలు కాకర్ల రాజరాజేశ్వరి రూ.93 లక్షలు మోసపోయారు. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం.. వాట్సప్‌లో రాజేశ్వరికి ఫోన్ చేసిన నేరగాడు తాను సైబర్ క్రైమ్ అధికారినని, ఆమెపై సుప్రీం కోర్టులో కేసు నమోదైందని చెప్పాడు. మీ ఆధార్ కార్డు, సిమ్ కార్డులు మా వద్ద ఉన్నాయని, మీ అకౌంట్‌లో డబ్బు ఆదాయానికి మించి ఉందని, కోర్టు మిమ్మల్ని అరెస్టు చేయమని చెప్పిందంటూ బెదిరించాడు. అరెస్టు నుంచి తప్పించుకోవాలంటే అకౌంట్‌లో సొమ్ము జమ చేయాలని ఆదేశించాడు. ఆమె భయపడి విడతలుగా సొమ్మును సైబర్ నేరగాడి అకౌంట్‌కు జమ చేశారు. జూన్ 15 నుంచి రూ.93 లక్షలు జమ చేశారు. ముందు రూ.60 లక్షలకు పైగా సొమ్మును జమ చేయించుకున్న అతను మళ్లీ ఆమెకు ఫోన్‌చేసి మీ బ్యాంక్ ఖాతాలన్నీ సక్రమంగా ఉన్నాయని, మీకు ఏ విధమైన ఇబ్బంది లేకుండా చేస్తానని, మరో 33 లక్షలు చెల్లిస్తే మొత్తం సొమ్ము మీ ఖాతాలో జమ చేస్తానని చెప్పాడు. ఆమె నమ్మి ఆ సొమ్మును కూడా జమ చేశారు. ఆ తరువాత నుండి అతని నుంచి ఫోన్ రాకపోవడంతో అనుమానం వచ్చింది. చివకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హనుమంతు నాగరాజు చెప్పారు.

ఓపెన్ కేటగిరీ బార్లకు గెజిట్

భీమవరం: జిల్లాలో ఓపెన్ కేటగిరీలో భర్తీ కాకుండా మిగిలిన బార్లను లాటరీ ద్వారా ఏర్పాటు చేయడానికి బుధవారం గెజిట్ విడుదల చేస్తున్నట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14వ తేది వరకూ దరఖాస్తులు స్వీకరిస్తామని 15న కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ తీసి కొత్త బార్లను కేటాయిస్తామన్నారు. భీమవరం మునిసిపాలిటీలో 4, తణుకులో 3, తాడేపల్లిగూడెంలో 4, నరసాపురంలో 2 బార్లకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

● కరెన్సీ నోట్లతో అలంకరణ



వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా తణుకు సజ్జాపురంలో లక్ష్మీగణపతి యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేడుకల్లో గణనాథుడి మండపాన్ని రూ.20 లక్షల కరెన్సీ నోట్లతో అలకరించారు. తెలంగాణ నుంచి తీసుకొచ్చిన 23 అడుగుల భారీ విగ్రహం 14 తలల దేవతామూర్తులతో ఈ ఏడాది తణుకులో ప్రత్యేక ఆకర్షణగా నిలవగా, మండపాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకుంటున్నారు. - తణుకు అర్బన్

దారి కాచి దాడులా?



మాట్లాడుతున్న గుడాల గోపి, ఉమాబాల, తాతాజీ, బాధితుడు(ఎర్ర టోపి పెట్టుకున్న వ్యక్తి)

పాలకొల్లు సెంట్రల్: వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దారి కాచి దాడి చేయడం చూస్తుంటే నియోజకవర్గంలో ఎన్నడూ లేని కొత్త సంస్కృతికి తెరలేపారని నియోజకవర్గ ఇంచార్జ్ గుడాల గోపి అన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్త రొణంకి శ్రీనివాస్‌పై దాడి విషయంలో నరసాపురం పార్లమెంటు ఇంచార్జ్ గూడూరి ఉమాబాల, యడ్ల తాతాజీతో కలిసి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ శ్రీనివాస్ నరసాపురంలో పని ముగించుకుని రాత్రి ఒంటి గంట సమయంలో వస్తుండగా పాలకొల్లు వచ్చేసరికి 20 మంది దారి కాచి ఏంటిరా సోషల్ మీడియాలో పవన్‌పై పోస్టింగ్‌లు పెడుతున్నావని ప్రశ్నించడంతో పాటు నిన్ను ఏదైనా చేస్తే మీ జగన్ వస్తాడా? అంటూ శ్రీనివాస్‌పై దాడి చేశారన్నారు. మంత్రి ఇలాంటి సంఘటనలకు మద్దతు తెలపడం వల్లే ఈ దారుణాలు జరుగుతున్నాయని తప్పుపట్టారు. 2022లో జరిగిన సంఘటనపై కేసును రీ ఓపెన్ చేయించి కేసు కట్టించారని, ఈ కేసులో మాత్రం ఎస్సైను అడిగితే రెండు రోజులైంది కదా ఇప్పుడు వస్తే ఎలా అని అడుగుతున్నారన్నారు. సీసీ పుటేజి ఆధారంగా తగిన చర్యలు తీసుకుని న్యాయం చేయాలన్నారు.

పేట్రేగిన టీడీపీ మూకలు

- వైఎస్సార్‌సీపీ యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు నానిపై దాడి
- ఆస్పత్రికి వెళ్తే అక్కడికీ వెళ్లి దాడిచేసిన టీడీపీ మూకలు

టాస్క్‌ఫోర్స్: కూటమి ప్రభుత్వంలో దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసుల పరంపర కొనసాగుతూనే ఉన్నాయి. వైఎస్సార్‌సీపీ యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు, శ్రీరామవరం సర్పంచ్ కామిరెడ్డి నానిపై దాడులు పరంపర కొనసాగుతోంది. గతేడాది జూలైనె నాని ఇల్లు, తండ్రి కార్యాలయంపై దాడి చేసి ఫర్నీచర్ ధ్వంసం చేయడంతో పాటు, ద్విచక్రవాహనాలను దగ్ధం చేశారు.

ఆస్పత్రిలో మరోసారి దాడి

నానిపై మంగళవారం టీడీపీ రౌడీ మూకలు హత్యాయత్నానికి పాల్పడ్డాయి. ఈ మేరకు నాని పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. నాని ప్రయాణిస్తున్న కారుపై కత్తి, క్రికెట్ కర్రతో దాడి చేసి అద్దాలు పగలగొట్టారు. మంగళవారం వైఎస్సార్ వర్ధంతిని పురస్కరించుకుని శ్రీరామవరంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి అనంతరం కారులో తిరిగివస్తుండగా శ్రీరామవరం మలుపు దాటిన తర్వాత టీడీపీ నాయకులు మోత్కూరు నాని, అక్కినేని రాజేంద్రప్రసాద్ తన కారుకు వాళ్ళ కారు అడ్డుపెట్టి క్రికెట్ కర్రలు, కత్తితో దాడి చేసి అద్దాలు పగలగొట్టారని చెప్పారు. తనను కారులో నుంచి కిందకు లాగి క్రికెట్ కర్రతో చంక కింద భుజం పైన కొట్టారన్నారు. తనపై టీడీపీ నాయకులు దాడి చేస్తుండగానే వారు ఫోన్ చేస్తే మరో 30 మంది వచ్చారన్నారు. తనపై జరిగిన హత్యాయత్నాన్ని ఎస్పీకి చెప్పి చూపించడానికి నాని ఎస్పీ కార్యాలయానికి వెళ్లారు. ఎస్పీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం చికిత్స నిమిత్తం ఆసుపత్రికి వెళితే అక్కడ కూడా టీడీపీ శ్రేణులు వచ్చి దాడి చేయడంతో పాటు అక్కడ ఉన్న పార్టీ నాయకులు కే. పట్టాభిరామయ్య, కే. బాలు, సాయిలపై దాడి చేశారు. ఈ దాడిలో పట్టాభిరామయ్య తలకు గాయమైంది. ఈ దాడులను మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి ఖండించారు.



దాడి చేసిన ఇద్దరి చేతిలో చేతిలో ఉన్న స్టిక్



దాడికి వాడిన కర్రను చూపుతున్న నాని

నరసాపురంలో కలెక్టరేట్‌కు వ్యతిరేకం కాదు

భీమవరం: నరసాపురంలో కలెక్టరేట్ ఏర్పాటుకు తాను వ్యక్తిగతంగా వ్యతిరేకిని కాదని కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ అన్నారు. నరసాపురంలో కలెక్టరేట్ ఏర్పాటు చేయాలని ఆ నియోజకవర్గ అఖిలపక్ష నాయకులు ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు ఆధ్వర్యంలో మంగళవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందచేశారు. భీమవరంలో ఇంతవరకూ పనులు ప్రారంభం కాలేదని ఈ నేపథ్యంలో నరసాపురంలో ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

కలెక్టర్‌కు వినతిపత్రం

భీమవరం (ప్రకాశంచౌక్): నరసాపురంలో జిల్లా కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అఖిల పక్ష నేతలు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా నలుమూలల నుంచి ప్రధాన కార్యాలయాలకు వచ్చే ప్రజలు, ఉద్యోగులకు నర్సాపురం సౌకర్యంగా ఉంటుందన్నారు. పట్టణంలో 50 ఎకరాల ప్రభుత్వ భూములు అందుబాటులో ఉన్నాయని వినతిపత్రంలో పేర్కొన్నారు.



కేంద్రమంత్రి శ్రీనివాసవర్మకు వినతిపత్రం అందచేస్తున్న నరసాపురం అఖిలపక్ష నాయకులు

వైఎస్ చలవతో తమ్మిలేరు కష్టాలకు చెక్

- రక్షణ గోడ నిర్మాణానికి నాంది పలికిన వైఎస్సార్
- రూ. 60 కోట్ల గోడతో ప్రజలకు ఊరట

ఏలూరు టౌన్: 'ఏలూరు దుఃఖదాయినిగా తమ్మిలేరును పిలుచుకునే పరిస్థితి.. తుపానులు, భారీ వర్షాలు కురిస్తే చాలు.. ఏలూరు నగరంలో తూర్పు, పడమరగా ప్రవహించే తమ్మిలేరు వరద ఉధృతికి జనం బెంబేలెత్తేవారు. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యేవి. ప్రజలంతా నిరాశ్రయులై పిల్లాపాపలతో బతికితే చాలు అన్నట్లు.. ప్రభుత్వం ఏర్పాటు చేసే పునరావాస కేంద్రాల్లో తలదాచుకునే దుస్థితి ఉండేది.

2005లో ముఖ్యమంత్రిగా దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఏలూరు నగరంలో వరద పరిస్థితులను పరిశీలించేందుకు హుటాహుటిన బయలుదేరి వచ్చారు. నగరంలోని పలు ప్రాంతాల్లో వరద నీటిలోనే వరద బాధితులను పరామర్శించారు. ప్రజలను తీవ్రస్థాయిలో కష్టాల్లోకి నెడుతున్న తమ్మిలేరు వరద ముంపునకు శాశ్వత పరిష్కారానికి ఆయన నాంది పలికారు. తమ్మిలేరు గట్లకు రక్షణ గోడ నిర్మాణం చేపట్టాలని సంకల్పించారు. నిధులు సైతం విడుదల చేశారు. నేడు ప్రజలు భయం లేకుండా సురక్షితంగా ఉన్నారంటే... 'మహానేత డాక్టర్ వైఎస్సార్ చలవే అంటారు'

తమ్మిలేరు వరదముప్పుకు శాశ్వత పరిష్కారం

తమ్మిలేరు ఏలూరు నగరంలోకి ప్రవేశిస్తూనే తూర్పు, పడమరగా రెండు పాయలుగా ప్రవహిస్తుంది. తూర్పు వైపు అశోక్‌నగర్, కుమ్మరిరేవు, ఇజ్రాయేల్‌పేట, బీడీ కాలనీ, తంగెళ్ళమూడి సెంటర్ మీదుగా వెళుతుంది. పడమరవైపు అశోక్‌నగర్ బ్రిడ్జికి ముందుగా ప్రవహిస్తూ శనివారపుపేట కాజ్‌వే మీదుగా అమీనాటపేట ఏటిగట్టు, జన్మభూమి పార్క్, సీఆర్ఆర్ కాలేజీ ప్రాంతంలో నుంచి పడమర లాకుల వైపు వెళుతుంది. అనంతరం ఎన్టీఆర్ కాలనీ, కొత్తూరు కాజ్‌వే, పోణంగి, వైఎస్సార్ కాలనీల మీదుగా ప్రవహిస్తుంది. ఈ ప్రాంతాలన్నీ గతంలో తమ్మిలేరు వరదముంపు ప్రభావిత ప్రాంతాలే కావటం విశేషం. భారీ ఎత్తున వరదనీరు ఏలూరు నగరంలోకి ప్రవేశిస్తే చాలు ప్రజలు వరద భయంతో వణికిపోయేవారు.


ఏలూరు అశోక్‌నగర్ బ్రిడ్జి ప్రాంతంలో ఎడమవైపు తమ్మిలేరు రివిట్‌మెంట్


ఏలూరు శనివారపుపేట కాజ్‌వే ప్రాంతంలో తమ్మిలేరు రక్షణ గోడ

రూ.60 కోట్లతో రక్షణ గోడ

ఏలూరు నగర ప్రజలకు తమ్మిలేరు ఏటిగట్టు వరద ముంపు నుంచి రక్షణ కల్పించేందుకు 2005లో దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రూ.60 కోట్లతో రక్షణ గోడ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఏలూరు అశోక్‌నగర్ ప్రాంతంలో తూర్పు, పడమర వైపు ఏటిగట్టుకు రివిట్‌మెంట్ నిర్మాణం చేశారు. మరోవైపు అమీనాపేట ప్రాంతంలో తమ్మిలేరుకు రెండు వైపులా రక్షణ గోడ నిర్మాణం చేశారు. ఈ రివిట్‌మెంట్‌తో వరద ముంపు బారి నుంచి కొంతమేర ఊరట లభించింది. అనంతరం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం హయాంలో రూ.80 కోట్లతో మరికొన్ని ప్రాంతాల్లో తమ్మిలేరుకు రివిట్‌మెంట్ నిర్మాణం చేశారు. వైఎస్సార్ కాలనీ, పోణంగి ప్రాంతాలకు పూర్తిస్థాయిలో వరద భయం పోయింది.

రివిట్‌మెంట్ నిర్మాణానికి చర్యలు



ఆనాడు మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఏలూరు నియోజకవర్గ ప్రజలు తమ్మిలేరు వరదముంపుతో కష్టాలు పడకూడదనే సంకల్పంతో రివిట్‌మెంట్ నిర్మాణానికి చర్యలు చేపట్టారు. యుద్ధప్రాతిపదికన నిధులు మంజూరు చేసి నిర్మాణం చేసేలా శ్రద్ధ చూపారు. దీంతో అమీనాపేట ఏటిగట్టు, ఇజ్రాయేల్‌పేట, అశోక్‌నగర్ ప్రాంతాల్లోని ప్రజలు ప్రశాంతంగా నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. మిగిలిన ప్రాంతాల్లోనూ తమ్మిలేరుకు రివిట్‌మెంట్ నిర్మాణం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

– పల్లి శ్రీనివాసరావు, వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు

మాజీ సీఎం జగన్ అన్నతోనే..



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మహానేత డాక్టర్ వైఎస్సార్ ఏలూరు నియోజకవర్గం ప్రజల పట్ల అభిమానంతో పనిచేశారు. తండ్రి, కొడుకులు ఇద్దరూ... ఏలూరుకు తమ్మిలేరు వరద నుంచి శాశ్వత పరిష్కారం లభించేలా కృషి చేశారు. పోణంగి, వైఎస్సార్ కాలనీల్లో ప్రజలు తమ్మిలేరుకు వరద వస్తే చాలు.. కట్టుబట్టలతో పరుగులు పెట్టే పరిస్థితి ఉండేది. కానీ మహానేత వైఎస్సార్ అనంతరం మాజీ సీఎం జగన్ అన్నతోనే ... మిగిలిన చోట్ల రివిట్‌మెంట్ నిర్మాణం సాధ్యం అవుతుంది.

– గంటా రాజేంద్ర, ఏలూరు వన్‌టౌన్

క్లుప్తంగా

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు


ఎరువుల దుకాణాలపై దాడులు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

తాడేపల్లిగూడెం: జిల్లాలోని పలు ఎరువుల దుకాణాలపై మంగళవారం విజిలెన్స్, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లిలో విజయ ట్రేడర్స్, వెంకటేష్ మెన్యూర్ డిపో, చాగ్రాయి మండలం చనుబండలో లక్ష్మీ వెంకటేశ్వర మెన్యూర్స్ అండ్ జనరల్ స్టోర్స్, డెక్కన్ ఆగ్రో కెమికల్స్‌పై దాడులు చేశారు. దుకాణాల్లో ఉన్న స్టాకునకు, వాస్తవ స్టాకునకు వ్యత్యాసాలు గుర్తించారు. సుమారు రూ.10 లక్షల 80 వేల 762 విలువ కలిగిన 53.565 టన్నుల ఎరువులు తేడా ఉన్నట్టు గమనించారు. ఈ మేరకు ఆ ఎరువులను సీజ్ చేసి, దుకాణ యజమానులపై నిత్యావసరాల చట్టం 1955 ప్రకారం 6ఏ కేసులు నమోదు చేశారు. దాడుల్లో రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారి పి.మహేష్, విజిలెన్స్ డీఎస్పీ సింగులూరి వెంకటేశ్వరరావు, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ పి.శివరామకృష్ణ, ఏఓ జి.మీరయ్య, ఎస్సై సీహెచ్ రంజిత్‌కుమార్, కె.సీతారాము, చాగ్రాయి, గూడెం వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

కారులో చెలరేగిన మంటలు


ఏలూరు అమీనాపేట వద్ద అగ్నికి ఆహుతైన కారు

ఏలూరు టౌన్: ఏలూరు అమీనాపేటలో మంగళవారం రాత్రి ఒక కారులో ఆకస్మికంగా మంటలు చెలరేగాయి. చూస్తుండగానే కారు అగ్నికి ఆహుతి అయ్యింది. ఏలూరు మంచినీళ్ళతోట ప్రాంతానికి చెందిన కురెళ్ళ సుబ్బారావుకి చెందిన కారులో మంగళవారం రాత్రి 8.15 గంటలకు యజమాని కుమారుడు వివేక్ ప్రయాణిస్తున్నాడు. అశోక్‌నగర్ వైపు నుంచి కారులో వెళుతూ ఉండగా అమీనాపేట సోనోవిజన్ షోరూమ్ సమీపానికి వచ్చే సరికి కారు ఇంజన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. స్థానికులు మంటలను అదుపుచేసే ప్రయత్నం చేశారు. ఏలూరు అగ్నిమాపక అధికారి రామకృష్ణ పర్యవేక్షణలో సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదు. కారు ఇంజన్ భాగం పూర్తిగా దగ్ధమైంది.

20 కాసుల బంగారం చోరీ

పాలకొల్లు సెంట్రల్: పెళ్లి ఇంట్లో బంగారు ఆభరణాల చోరీపై కేసు నమోదైంది. మండలంలోని ఉల్లంపర్రు గ్రామంలో పెన్మెత్స సుబ్బరాజు ఇంట్లో ఇటీవల వివాహం జరిగింది. వివాహ వేడుక అనంతరం చూసుకోగా హారం, నల్లపూసలు, గొలుసు, తెలుపు గులాబి రంగు రాళ్ల ముత్యాల నక్లీసు, బంగారు గాజులు, దుద్దులు మొత్తం దాదాపుగా 20 కాసుల వరకూ బంగారు ఆభరణాలు పోయినట్లు గుర్తించారు. వీటి విలువ సుమారు రూ.11 లక్షల వరకూ ఉంటుందని అంచనా. ఇంటిలో ఓ వ్యక్తిపై అనుమానం ఉన్నట్లు సుబ్బరాజు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్సై బి. సురేంద్రకుమార్ తెలిపారు.

క్షీరారామంలో శివ సహస్రనామ పూజలు


శివ సహస్రనామార్చనలో పాల్గొన్న భక్తులు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామ లింగేశ్వరస్వామి ఆలయంలో సప్త సోమవారముల ప్రదక్షిణలు పూర్తిచేసుకున్న భక్తులు మంగళవారం శివ సహస్రనామ పూజల్లో పాల్గొన్నారు. సుమారు 50 మంది ఈ కార్యక్రమాల్లో పాల్గొని పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ పసుపులేటి వాసు, ఆలయ అభిషేక పండితులు భమిడపాటి వెంకన్న, అర్చకులు వీరబాబు, పూర్ణయ్య, మద్దూరి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

వీసీ నియామకంలో వీడని సందిగ్ధత

తాడేపల్లిగూడెం: డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ ఉపకులపతి నియామకం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి ఉత్తర్వులు మంగళవారం సాయంత్రానికి కూడా రాలేదు. దీంతో ఈ కుర్చీ విషయంలో సందిగ్ధ స్థితి కొనసాగుతోంది. కొత్త ఉపకులపతి వస్తేనే కాని, లేదంటే ఎవ్వరినైనా ఇన్‌చార్జిగా నియమించి వారు ఇక్కడకు వచ్చి బాధ్యతలు స్వీకరించేవరకు ప్రస్తుతమున్న వీసీ కొనసాగుతారు. అయితే విధాన పరమైన కీలక నిర్ణయాలు తీసుకొనే వెసులుబాటు ఉండదు. మార్గదర్శకాలు, నిబంధనల ప్రకారం వర్సిటీ రిజిస్ట్రార్ పర్యవేక్షించే అవకాశం ఉంటుంది.

రోడ్డెక్కిన గ్రీన్‌ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతులు

సర్వీస్ రోడ్లు నిర్మించాలని డిమాండ్

చింతలపూడి: గ్రీన్ ఫీల్డ్ హైవేకు సర్వీస్ రోడ్లు ప్రొవిజన్ కల్పించాలని, గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల సమస్యలు పరిష్కరించాలని రైతులు డిమాండ్ చేశారు. భూ నిర్వాసిత రైతుల పోరాట కమిటీ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రేచర్ల గ్రామం వద్ద ఆందోళన చేపట్టారు. భూ నిర్వాసిత రైతుల సమస్యలు పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రీన్ ఫీల్డ్ హైవేకు సర్వీస్ రోడ్లు ప్రొవిజన్ కల్పించకపోవడం దారుణమని విమర్శించారు. రైతులు తమ పొలాలకు వెళ్లే మార్గాలు లేక, తమ పంటలు తెచ్చుకునే అవకాశం లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక చోట్ల అండర్ పాస్‌లు తగినంత ఎత్తు, వెడల్పుతో నిర్మాణం చేయకపోవడంతో గ్రామాల మధ్య రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయని చెప్పారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే వలన ప్రతి గ్రామం పరిధిలో సమస్యలు ఉన్నాయని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అధికారులు క్షేత్ర స్థాయిలో గ్రామాల వారీగా రైతులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలన్నారు. రేచర్ల ఎగ్జిట్ వద్ద రైతులు తమ పొలాలకు వెళ్లే మార్గం లేదన్నారు. సర్వీస్ రోడ్ ఏర్పాటు చేస్తామని, ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని అధికారులు ఇచ్చిన హామీలు అమలు కాలేదన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు హైవే అథారిటీ, రెవెన్యూ అధికారులు, కేఎంవీఎల్ రోడ్డు నిర్మాణ సంస్థ మేనేజర్ తదితరులు గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణం వలన రైతులకు, ప్రజలకు వస్తున్న సమస్యలను పరిశీలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ రైతులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.


రేచర్ల గ్రామం వద్ద గ్రీన్‌ఫీల్డ్ హైవేపై నిరసన తెలుపుతున్న భూ నిర్వాసిత రైతులు

గోదావరికి తగ్గుముఖం పట్టిన వరద

పోలవరం: గోదావరి వరద తగ్గుతుండటంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద 32.350 మీటర్లకు నీటిమట్టం చేరుకుంది. స్పిల్‌వే 48 గేట్ల నుంచి దిగువకు 9 లక్షల 31 క్యూసెక్కుల నీరు చేరుతుంది. ఎగువన భద్రాచలం వద్ద వరద తగ్గుతూ 41.30 అడుగులకు చేరుకుంది.

ట్రాక్టర్ డ్రైవర్‌కు రిమాండ్

నరసాపురం రూరల్: వినాయక నిమజ్జన వేడుకలో ట్రాక్టర్ నడిపి ప్రమాదానికి కారణమైన డ్రైవర్ ఈవన రాజును అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రెండు వారాల పాటు రిమాండ్ విధించినట్లు రూరల్ సీఐ దుర్గాప్రసాద్ తెలిపారు. ఆదివారం రాత్రి తూర్పుతాళ్ల గ్రామంలో గణేష్ నిమజ్జన వేడుకల్లో అపశ్రుతి చోటు చేసుకుని ట్రాక్టర్ ఢీకొట్టడంతో నలుగురు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్ ఈవన రాజును మంగళవారం రిమాండ్‌కు తరలించారు.

వైద్యం వికటించి.. యువతి మృతి

ఆర్ఎంపీ క్లినిక్ వద్ద బంధువుల ఆందోళన

ఏలూరు టౌన్: ఆర్ఎంపీ వైద్యుడి నిర్వాకంతో వైద్యం వికటించి ఒక యువతి మృతిచెందింది. దీంతో మృతురాలి బంధువులు ఆర్ఎంపీ వైద్యుడి క్లినిక్ వద్ద మంగళవారం ఆందోళనకు దిగారు. ఏలూరు వన్‌టౌన్ తూర్పువీధి మేకల కబేళా ప్రాంతానికి చెందిన కటారి భారతి (20) భర్తతో కలిసి జీవిస్తోంది. గత మూడు రోజులుగా తీవ్రమైన జ్వరంతో బాధపడుతుండడంతో ఆమెను మంగళవారం వంగాయగూడెం సెంటర్‌లోని ఆర్ఎంపీ వైద్యుడు నాని వద్దకు తీసుకువెళ్లారు. అతని క్లినిక్ పక్కనే ఉన్న మెడికల్ షాపులో రెండు ఇంజక్షన్లు తీసుకుని జ్వరంతో బాధపడుతున్న భారతికి నరంలోకి ఇంజెక్షన్ ఇచ్చారు. కొంతసేపు విశ్రాంతి తీసుకోవాలని బంధువులకు సూచించాడు. ఇంజక్షన్ చేసిన 15 నిమిషాల వ్యవధిలోనే ఆమె స్పృహ కోల్పోయింది. బంధువులంతా భయపడగా... ఏమీ కాదనీ కంగారుపడవద్దని ఆర్ఎంపీ వైద్యుడు నాని చెప్పాడు. కొంతసేపు గడచిన అనంతరం మెరుగైన వైద్యం కోసం వేరొక హాస్పిటల్‌కు తరలించాలని సూచించాడు. బంధువులు వేరొక హాస్పిటల్‌కు తరలించేందుకు ప్రయత్నిస్తూ ఉండగానే ఆమె మృతిచెందింది. కోపంతో బంధువులంతా ఆమె మృతదేహంతో నాని క్లినిక్ వద్ద ఆందోళన చేపట్టారు. ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం రావటంతో ఘటనా స్థలానికి వెళ్లి బాధితులతో మాట్లాడి సర్దిచెప్పారు. మృతదేహాన్ని ఏలూరు జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదే తరహాలో ఆర్ఎంపీ వైద్యుడి నిర్వాకంతో గతంలోనూ ఇలాంటి ఘటనలే చోటుచేసుకున్నాయని ఆరోపిస్తున్నారు. అతనికి వైద్యం చేసే అర్హత కూడా లేదని పలువురు చెబుతున్నారు.


కటారి భారతి మృతదేహం

ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్ మృతి


పంట బోదెలోకి బోల్తా పడిన ట్రాక్టర్


ఘటనా స్థలంలో సింగులూరి రాంబాబు మృతదేహం

ఉంగుటూరు: ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పంట బోదెలోకి బోల్తా పడడంతో డ్రైవర్ మృతి చెందిన ఘటన నారాయణపురంలో చోటుచేసుకుంది. చేబ్రోలు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నిడమర్రు మండలం బావాయిపాలెం గ్రామానికి చెందిన సింగులూరి రాంబాబు (59) భీమవరంలో ట్రాక్టరుపై డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. ఈ క్రమంలో ట్రాక్టర్‌పై చేపల మేతలోడు భీమవరం నుంచి భీమడోలు మండలం గుండుగొలను తీసుకువెళ్లి అక్కడ దించేసి ఖాళీ ట్రాక్టరుతో తిరిగి భీమవరం వస్తున్నాడు. చేబ్రోలు వంతెన మీదనుంచి నారాయణపురం పుంత రహదారిమీదుగా వెళుతుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ అదుపు తప్పి పక్కనే ఉన్న పంట బోదెలోకి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ రాంబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. అతడికి భార్య వరలక్ష్మి ఇద్దరు కుమారులు ఉన్నారు. మంగళవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పజెప్పగా అంత్యక్రియలు నిర్వహించారు. చేబ్రోలు ఎస్సై సూర్య భగవాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తప్పని పడవ ప్రయాణం

ఐదో రోజూ జలదిగ్బంధంలోనే 25 గ్రామాలు

వేలేరుపాడు: భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమేపీ తగ్గుముఖం పడుతున్నా వేలేరుపాడు మండలాన్ని ముంపు వీడటం లేదు. మంగళవారం రాత్రి 8 గంటలకు భద్రాచలం వద్ద 41.40 అడుగులకు చేరింది. అయినప్పటికీ మండలంలో అనేక గ్రామాలు ఇంకా జలదిగ్బంధనంలోనే ఉన్నాయి. వేలేరుపాడు మండలంలో 25 గ్రామాలు ఐదో రోజూ కూడా జలదిగ్బంధనంలోనే ఉన్నాయి. వేలేరుపాడు నుంచి కొయిదా వెళ్లే రహదారిలో మేళ్ళవాగు, ఎద్దెలవాగు, టేకూరు, తదితర వాగుల వంతెనలు ముంపులోనే ఉన్నాయి. దిగువనున్న కొయిదా, కాచారం, పేరంటపల్లి, టేకుపల్లి, తాళ్ళగొంది, పూసుగొంది, టేకూరు, కట్కూరు, సిద్దారం, ఎడవల్లి, చిట్టంరెడ్డిపాలెం, ఎర్రతోగు, చిగురుమామిడి, బోళ్ళపల్లి, పాతనార్లవరం, తూర్పుమెట్ట, కొత్తూరు, తదితర గ్రామాలతోపాటు మరో ఎనిమిది గ్రామాలు జలదిగ్బంధనంలోనే ఉన్నాయి. వేలేరుపాడు నుంచి రేపాకగొమ్ము, వెళ్లే రహదారి మంగళవారం బయటపడింది. దీంతో ఆయా గ్రామ ప్రజలు మోకాల్లోతు నీటిలో ప్రయాణిస్తున్నారు. రుద్రమకోట వెళ్లే రహదారులు ఇంకా నీటిలోనే మునిగి ఉండటంతో ఆయా గ్రామాల ప్రజలు లచ్చిగూడెం గ్రామం గుండా రాకపోకలు సాగిస్తున్నారు. దిగువ గ్రామాల ప్రజలు పడవలపై ప్రయాణిస్తున్నారు.


ఎడవల్లి ఎద్దెలవాగు వంతెనపై నాటు పడవలో ప్రయాణిస్తున్న దిగువ గ్రామాల ప్రజలు

వాటా.. కోటాగా కూటమి ప్రభుత్వం

మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ విమర్శ


సమావేశంలో మాట్లాడుతున్న కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: ప్రజాపాలన విస్మరించి కూటమి ప్రభుత్వం తమ కార్యకర్తలకు కోటా.. వాటాగా పనిచేస్తోందని రాష్ట్ర మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ విమర్శించారు. మంగళవారం సాయంత్రం జట్లపాలెంలోని ఎస్సీపేట వైఎస్సార్ విగ్రహం వద్ద వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొట్టు మాట్లాడుతూ నియోజకవర్గం నుంచి రాష్ట్రం దాకా కూటమి నేతలు కోటా, వాటాగా పంచేసుకుంటున్నారన్నారు. ప్రధానంగా జిల్లాలోని పలు ప్రాంతాలకు సంబంధించి సీజన్ ఎరువులు గూడెం వస్తాయని, అయితే ఎరువుల ర్యాక్‌లను కూటమి నేతలు పంచుకుంటూ రైతుల సమస్యలను గాలికొదిలేశారన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరిస్తానని చెప్పిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కూటమికి తలొగ్గారన్నారు. హామీలను అమలు చేయకుండా చంద్రబాబు ఏంచెబితే దానికి తలూపడం సరికాదన్నారు. గత ప్రభుత్వంలో జగనన్న ప్రవేశపెట్టిన పలు పథకాలకు చంద్రబాబు తూట్లు పొడిచారన్నారు. తల్లికి వందనం కార్యక్రమం లోకేష్ పెట్టినట్లు గొప్పలు చెబుతూ ప్రజలను వంచిస్తున్నారన్నారు.

వైఎస్సార్ సీపీ పటిష్టతకు కృషి చేయాలి

వైఎస్సార్ సీపీ పటిష్టతకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని కొట్టు సత్యనారాయణ పిలుపునిచ్చారు. జగనన్న సంక్షేమ పాలనను ప్రజలకు మళ్లీ అందించేలా ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా పేదలకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం పలువురు మహిళలు కూటమి నాయకుల ఆగడాలను కొట్టు సత్యనారాయణకు వివరించారు. కార్యక్రమంలో జట్లపాలెం గ్రామ ఎస్సీపేట కార్యకర్తలతో పాటు బోణం వీరయ్య, కర్రి భాస్కరరావు, కొలుకులూరి ధర్మరాజు, బొద్దాని శ్రీనివాస్, కొలుపూరి ఉదయ్‌భాస్కర్, గుండుమోగుల సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళపై దాడి.. కేసు నమోదు

ముదినేపల్లి రూరల్: మహిళపై దాడి ఘటనకు సంబంధించి ముగ్గురు వ్యక్తులపై స్థానిక పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం మండలంలోని పెనుమల్లి శివారు శింగారంలో వినాయకచవితి సందర్భంగా గత నెల 27న ఉత్సవాల వద్ద ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీలో వాసుపల్లి నాగరాజు ఫొటో ముద్రించారు. అదే గ్రామానికి చెందిన జి రామకృష్ణ ఆగ్రహించి నాగరాజు ఇంటికి వెళ్లి ఫ్లెక్సీపై ఫొటో వేసుకునే స్థాయి నీకెక్కడిది అంటూ, ఎందుకు వేయించుకున్నావంటూ వినాయకచవితి రోజున దూషించాడు. అనంతరం సోమవారం రాత్రి గ్రామంలో జరిగిన అన్నసమారాధనకు నాగరాజు వెళ్లగా అక్కడ దాడి చేసేందుకు రామకృష్ణ యత్నించాడు. రామకృష్ణతోపాటు నాగరాజు, వీరబాబు వాసుపల్లి నాగరాజు ఇంటికి వెళ్లి రాడ్లతో దాడి చేయబోగా తప్పించుకోవడంతో అడ్డు వచ్చిన నాగరాజు భార్య మాధవికి తగిలి గాయాలయ్యాయి. దీనిపై బాధితురాలు మాధవి మంగళవారం ఫిర్యాదు చేయగా ఎస్సై వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

క్లుప్తంగా

మహిళా చట్టాలపై అవగాహన



వరిఘేడులో చట్టాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అత్తిలి: మండలం వరిఘేడు గ్రామంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో మిషన్ శక్తి మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు ఎం శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమంలో ఆమె కేంద్రీకృత పథకాలు, విధానాలు, ప్రధానమంత్రి మాతృ వందన యోజన పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళ కార్యదర్శి సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం



రక్త పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఉచిత మధుమేహ నిర్ధారణ పరీక్షలు తప్పక చేసుకోవాలని లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ సభ్యులు పలు సూచనలు చేశారు. స్థానిక ఆర్ అండ్ బి గ్రౌండ్స్‌లో ఫాస్ట్ జోన్ చైర్‌పర్సన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు ఆధ్వర్యంలో సర్వీస్ చైర్‌పర్సన్ కోనా హనుమాన సౌజన్యంతో ఉచిత షుగర్ రక్త పరీక్షలు శిబిరం జరిగింది. వక్తలు మాట్లాడుతూ శారీరక వ్యాయామం తప్పనిసరి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కంచర్లలక్ష్మి నరసింహం, మానేపల్లి కిరణ్, దంగేటి ముఖర్జీ, యర్రా ఆంజనేయ స్వామి, ఈగల త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ఆశాడే కార్యక్రమంలో మాట్లాడుతున్న సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వరరావు

అత్తిలి: వాతావరణ మార్పుల దృష్ట్యా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సబ్‌యూని ట్ అధికారి గుడిమెట్ల వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం అత్తిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె.నాగరాజు ఆధ్వర్యంలో ×ఆశాడ్డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కాలానుగుణ వ్యాధులైన మలేరియా, చికున్ గున్యా, అతిసారం, టైఫాయిడ్, జాండిస్ వంటివి రాకుండా ప్రతి రోజూ ×డ్రైడ్డే పాటించాలన్నారు. చేతుల శుభ్రత, ఆహార పదార్థాలను ఉంచిన పాత్రలపై ఈగలు వాలకుండా విధిగా మూతలు ఉంచడం, కాచి చాలర్చిన నీటిని తాగడం వంటి నియమాలు పాటించాలని కోరారు. రెగ్యులర్ ఫీవర్ సర్వే తప్పనిసరిగా చేయాలని, క్షేత్ర స్థాయిలో విలేజ్ హెల్త్ సెక్రెటరీలు, హెల్త్ అసిస్టెంట్స్, ఆశా కార్యకర్తలు, పర్యవేక్షక సిబ్బంది కమ్యూనికేషన్ గ్యాప్ లేకుండా సమన్వయంతో విధులు నిర్వర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ జి.ప్రమీల, ఆరోగ్య పర్యవేక్షకులు జి.అమ్మాజి,ఎ.వెంకటరాజు, హెల్త్ అసిస్టెంట్స్ జె.గనిరాజు,టి.నాగకృష్ణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందజేత

పాలకొల్లు సెంట్రల్: మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవీ బాధితులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. మంగళవారం స్థానిక వీవర్స్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్‌లో దాత జక్కంపూడి రాంప్రసాద్ 25 మంది హెచ్ఐవీ బాధితులకు పౌష్టికాహారం అందజేశారు.



అత్తిలి: వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ శ్రేణులు



తణుకు అర్బన్: వైఎస్సార్ పార్కులో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



తణుకు అర్బన్: దువ్వలో వైఎస్సార్ విగ్రహం వద్ద జోహార్లు అర్పిస్తున్న పార్టీ నాయకులు

పేదల పెన్నిధి వైఎస్సార్

తాడేపల్లిగూడెం, తణుకు డివిజన్‌లో వైఎస్సార్ వర్ధంతి వేడుకలు



ఆర్టీసీ డిపో సెంటరులో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



మాధవరంలో చీరలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జద్దు హరిబాబు

తాడేపల్లిగూడెం అర్బన్ : దేశవ్యాప్తంగా ఇప్పటికీ ఏ ముఖ్యమంత్రి అందించలేని సంక్షేమ పాలన అందించిన మహానేత వైఎస్సార్ ప్రజల గుండెల్లో దేవుడిగా నిలిచి ఉన్నారని మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని స్థానిక పోలీస్ ఐలాండ్, ఆర్టీసీ డిపో సెంటర్లలో ఉన్న వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి మంగళవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఆరోగ్య శ్రీ పథకాన్ని దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం యోచిస్తుందన్నారు. అదేవిధంగా 108 అంబులెన్స్ సేవలను ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించేందుకు అన్ని దేశాలు ఆలోచన చేస్తున్నాయన్నారు. 2004లో తాను ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం తాడేపల్లిగూడెం నియోజకవర్గ అభివృద్ధి ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్సార్ అందించిన సహకారం ప్రజలు మర్చిపోలేదన్నారు. చూపు ఉండి అంధులుగా ఉన్నవారికి అభివృద్ధి కానరాకపోవడంతో అభివృద్ధి ఏదని తడుముతున్నారన్నారు. తండ్రిని మించిన తనయుడిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అందించిన సంక్షేమ పథకాలు కూటమి ప్రభుత్వం అమలు చేయలేకపోవడం దారుణమన్నారు. వ్యవసాయ రంగానికి సరిపడా యూరియా అందించలేక కోటా పేరుతో వాటాలు పంచుకుంటున్నారని విమర్శించారు. ఒక్కడిగా పోటీ చేసి గెలవలేక ప్రజలను మోసం చేసి చంద్రబాబును ప్రజలు గుర్తించారన్నారు. మళ్లీ వైఎస్ జగన్‌మోహనరెడ్డికి అధికారం ఎక్కించేందుకు ప్రజల సన్నద్ధమవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొలుకులూరి ధర్మరాజు, కర్రి భాస్కరరావు, ముప్పిడి సంపత్‌కుమార్, జిడ్డు హరిబాబు, కర్నాటి కన్నయ్య, కొట్టు నాగేంద్ర, దాసిబాబు, బొద్దాని శ్రీనివాసు, గోకా వెంకటేశ్వరరావు, సిర్రాపు శాంతకుమార్, తగరపు మురళీ, షేక్ నౌషద్, ఎంపీటీసీ గొర్రల సుబ్బలక్ష్మి, అరిగెల అభిషేక్, మిరియాల శేషు, ఉండ్రాజవరపు భుజింగరావు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

రాజశేఖరుడికి ఘన నివాళులు

తణుకు అర్బన్: మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా తణుకు నియోజకవర్గంలో వాడవాడలా వైఎస్సార్ విగ్రహాలవద్ద పార్టీ శ్రేణులు, రాజన్న అభిమానులు ఘన నివాళులర్పించారు. తణుకు పట్టణంలో మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్రపతి రోడ్డులోని వైఎస్సార్ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి మాట్లాడుతూ పేద ప్రజలకు సంక్షేమ పాలన ఎలా అందివ్వాలో ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు వైఎస్ రాజశేఖరరెడ్డి అన్నారు. 108, ఆరోగ్యశ్రీ పథకాలతో పేదలకు ఖరీదైన వైద్యసేవలను ఉచితంగా అందించిన ఘనత వైఎస్సార్‌కి మాత్రమే దక్కుతుందన్నారు. లక్షలాది రూపాయిలు వెచ్చించి చేయించుకునే గుండె ఆపరేషన్లు సైతం ఉచితంగా పేదోడి గుండె చప్పుడుగా వైఎస్సార్ నిలిచారని అన్నారు. పేదలకు సొంత గూడు కల్పించి పేదల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. అనంతరం హౌసింగ్ బోర్డు కాలనీలోని వైఎస్సార్ పార్కులోని వైఎస్సార్ విగ్రహం వద్ద పార్టీ శ్రేణులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రుద్రా ధనరాజు, పంచాయితీరాజ్ వింగ్ రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి సీతారాం, జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీ యిండుగపల్లి బలరామకృష్ణ, పబ్లిసిటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు జల్లూరి జగదీష్, నియోజకవర్గ మహిళాధ్యక్షురాలు మెహర్ అన్సారీ, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, తణుకు మండల మహిళాధ్యక్షురాలు ఉండవల్లి జానకి, మాజీ ఏఎంసీ చైర్‌పర్సన్ నత్తా కృష్ణవేణి, తణుకు మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు జంగం అనంద్‌కుమార్, డాక్టర్ దాట్ల సుందరరామరాజు, డీజే అమూల్యారావు, ఎస్వీ జాకబ్‌బాబు, షేక్ ఫహీమా, పుల్లెపు సూర్యచంద్రరావు, కొమ్మోజు రామకృష్ణ, యారబాటి రామకృష్ణ, డీజే అమూల్యారావు, ధనలక్ష్మి, బిరుదుకోట చింతన్న, పైడి సాయిసూర్య, ఉండవల్లి సురేష్, వన్నెంరెడ్డి మురళీమోహన్, పైడోయిన ఏసుబాబు, చింతలపూడి సూర్యనారాయణ, షేక్ జిలాని, నాసరి పార్థసారధి, దొరబాబు, గారపాటి సత్యనారాయణ, కంచుమర్తి విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

దువ్వలో..

తణుకు మండలం దువ్వ గ్రామంలో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దువ్వ గ్రామ సర్పంచ్ అడ్డా బాబు మాట్లాడుతూ సంక్షేమ ప్రదాతగా పేదవర్గాల గుండెల్లో వైఎస్సార్ గూడుకట్టుకున్నారని అన్నారు. అనంతరం గ్రామ పార్టీ నాయకులు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రుద్ర ధనరాజు, శిరిగిశెట్టి గోపాలకృష్ణ, గెల్లా జగన్, గెల్లా బాలకృష్ణ, మాండ్రు కుమార్, ఎస్.సునీల్, ఎంపీటీసీ పెనుమాక అశోక్, కడియం వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

మహానేత వైఎస్సార్

అత్తిలి: ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి అని వైఎస్సార్ సీపీ ఎంప్లాయీస్, పెన్షనర్స్ విభాగం జిల్లా అధ్యక్షుడు పెన్మెత్స రామరాజు అన్నారు. అత్తిలిలో మంగళవారం వైఎస్ రాజశేఖరరెడ్డి 16వ వర్ధంతిని కార్యక్రమం మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా రామరాజు మాట్లాడుతూ నాడు రాజశేఖరరెడ్డి ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన ఫీజు రియెంబర్స్‌మెంట్, 108 సర్వీసులు, ఆరోగ్యశ్రీ, పేదలకు పక్కా గృహాలు వంటి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసి, పేద ప్రజలకు అండగా నిలిచారన్నారన్నారు. తండ్రి బాటలో ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలు ఆర్థికాభివృద్ధి సాధించే విధంగా ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశారని కొనియాడారు. ఈసందర్భంగా బస్‌స్టేషన్ సెంటర్‌లో, సంతమార్కెట్ సెంటర్‌లో ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పార్టీ శ్రేణులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బుద్దరాతి భరణీ ప్రసాద్, జెడ్పీకోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, అత్తిలి టౌన్ అధ్యక్షుడు పోలినాటి చంద్రరావు, మండల పార్టీ నాయకులు రంభసూరిబాబు, కంకటాల సతీష్, కాసగాని చిన్నా, సబ్బితి రాజేష్, కోరుకొల్లు వెంకట్రావు, రాయుడు ధర్మారావు, దిరిశాల నాగబాబు, యడ్లపల్లి మణికుమార్, యడ్లపల్లి దుర్గారావు, మద్దాల బాపిరాజు, గర్నిపూడి సర్వేశ్వరరావు, బుంగా పద్మారావు, కట్టా అప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన మహనీయుడు వైఎస్సార్

తాడేపల్లిగూడెం (టీటీసీ): విద్యా, వైద్య రంగాలలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన మహనీయుడు డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు కొనియాడారు. డాక్టర్ వైఎస్సార్ 16వ వర్ధంతి సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మంగరాజు మాట్లాడుతూ వైఎస్సార్ కృషిని ఉమ్మడి ఏపీ ప్రజలు మరువలేరని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపి, కోట, మానుకొండ తదితరులు పాల్గొన్నారు.

జనం మెచ్చిన నేత వైఎస్సార్

తాడేపల్లిగూడెం రూరల్: జనం మెచ్చిన నేత వైఎస్సార్ అని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి తాడేపల్లి మోషే పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కుంచనపల్లి గ్రామంలో దివంగత డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి నిర్వహించారు. తొలుత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మోషే మాట్లాడుతూ వైఎస్సార్ పాలన స్వర్ణయుగం అన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటి ఆదినారాయణ, మేకా సత్యనారాయణ, కనుపూరి ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, జగన్నాథపురంలో వైఎస్సార్ వర్ధంతి నిర్వహించారు. నాయకులు ముళ్ళపూడి బాపన్న, ఎమ్పీటీసీ నార్ని నాగేశ్వరరావు(నాగులు), ముప్పిడి లక్ష్మణరావు, తాతరాజు, ఎం.రాము, అడ్డాల గోపీ, కండెల్లి రాజేష్ పాల్గొన్నారు. పడాల మార్కెట్ యార్డులో ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ గుండుబోగుల వెంకటరమణ – నాగు దంపతులు చీరలు పంపిణీ చేశారు. దండగర్రలో ములగాల గంగారావు, పచ్చా బేబి రాణి, ములగాల శ్రీనివాస్, పుల్లాయగూడెంలో ఎమ్పీటీసీ మార్లపూడి సుబ్బారావు, కృష్ణాయపాలెంలో కంఠమని సత్యనారాయణ, నక్కా గంగాధర్, ఆరుగొలనులో సబ్బితి బ్రహ్మయ్య, కొమ్ముగూడెంలో వెలిశెట్టి నరేంద్రకుమార్, సూర్పని రామకృష్ణ, వెంకట్రావుపాలెంలో సర్పంచ్ ఎలిపే గాంధీ, వెంకట్రామన్నగూడెంలో పోలిమోను శ్రీనివాస్, కడియద్దలో యాతం బూరయ్య, పరిమి వెంకటేశ్వరరావు (భూపయ్య), చినతాడేపల్లి, ఉప్పరగూడెం, వీరంపాలెం, బంగారుగూడెం తదితర గ్రామాల్లో వైఎస్సార్ వర్ధంతి నిర్వహించారు. మాధవరంలో జద్దు హరిబాబు మహిళలకు చీరలు పంపిణీ చేశారు. రంగయ్య, రాజాబాబు పాల్గొన్నారు.

మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు

పెంటపాడు: మండలంలో పలు గ్రామాల్లో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు మంగళవారం నిర్వహించారు. కొండేపాడులో స్థానిక నెహ్రూ విగ్రహం వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పార్టీ నాయకులు దేవరశెట్టి రాంబాబు, మద్రే కృష్ణమూర్తి తదతరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు పళ్ల పంపిణీ చేశారు. పెంటపాడు కోనేరు చెరువు వద్ద ఉన్న వైఎఎస్సార్ విగ్రహం వద్ద రాష్ట్ర బీసీ సంఘ నాయకులు రెడ్డి సూరిబాబు, గ్రామ ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, బర్ల జయరాంబాబు తదితరులు ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్ర హానికి పూలమాలలు వేశారు. పెంటపాడు కళాశాల సెంటర్‌లో రెడ్డి సంఘ నాయకులు పోతంశెట్టి లక్ష్మి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి తదితరులతో పాటు, పార్టీ నాయకులు నల్లమిల్లి అంజిరెడ్డి తదితరులు వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల పార్టీ అధ్యక్షుడు కైగాలశ్రీనివాస్, గుండు మోగుల సాంబయ్య తదితరుల ఆధ్వర్యంలో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు.

ఇరగవరంలో..

ఇరగవరం: దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా మండలంలోని 21 గ్రామాలలో మంగళవారం మహానేత విగ్రహాలకు ఆయన అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇరగవరం, ఏలేటిపాడు , కె ఇల్లిందలపర్రు, పేకేరు, అయితంపూడి, కొత్తపాడు, కత్తవపాడు, యార్రాయి చెరువు, తూర్పు విప్పర్రు, కె కె వల్లి, ఆర్ ఖండ్రిక, కావలిపురం, రేలంగి, కంతేరు, కాకిలేరు, గ్రామాల్లోని వైఎస్సార్ విగ్రహలకు పూల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా వైఎస్సార్ సీపీ జనరల్ సెక్రటరీ మల్లిరెడ్డి నాగార్జున మాట్లాడుతూ ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సాధించిన మహానేత వైఎస్సార్ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, మాజీ ఎంపీపీ వెలగల సాయిబాబా రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, గుడిమెట్ల సత్యనారాయణ రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కార్యకర్త, అభిమాను తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంగరాజు



తాడేపల్లిగూడెం రూరల్: కుంచనపల్లి గ్రామంలో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమం



ఇరగవరం: ఏలేటిపాడు గ్రామంలో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు



పెంటపాడు: పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

అధిక ఎరువుల వినియోగాన్ని తగ్గించాలి

అత్తిలి: రైతులు అధిక ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ కోరారు. మంగళవారం అత్తిలి మండలం పాలూరు గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా వ్యవసాయాధికారి టీకే రాజేష్ మాట్లాడుతూ సిఫారసు మేరకు మాత్రమే యూరియా వినియోగించాలని కోరారు. నానో యూరియా వినియోగించాలని తద్వారా నూటికి నూరు శాతం నత్రజని ఆకుల ద్వారా వరి పంట తీసుకుంటుందని తెలిపారు. అక్కడక్కడ బ్యాక్టీరియా ఆకు ఎండ తెగులు లక్షణాలు కనిపిస్తున్నాయని దాని నివారణకు ప్లాంటమైసిన్ లేదా కాపర్ హైడ్రాక్సైడ్ తెగులు మందులు వినియోగించి పిచికారి చేయాలని సూచించారు. బ్యాక్టీరియా ఆకు తెగులు సోకిన పొలంలో నీరు తీసివేసి 48 గంటల తర్వాత 15కిలోల పొటాష్ వేసి నీరు పెట్టాలని, యూరియా వినియోగాన్ని పూర్తిగా నిలిపివేయాలని ఏఓ రాజేష్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాపేటి సింహాచలం, పీఏసీఎస్ అధ్యక్షుడు అల్లూరి ధనరాజు, రైతులు పాల్గొన్నారు



పాలూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులకు సూచనలు ఇస్తున్న ఏఓ రాజేష్

డ్రోన్ వినియోగంతో ఎంతో ఆదా

పెనుగొండ: వ్యవసాయంలో డ్రోన్ వినియోగంతో సమయం, ఖర్చు ఆదా అవుతుందని వ్యవసాయ శాఖ ఏడీఏ ఎంవీ రమేష్ అన్నారు. మంగళవారం చినమల్లం ప్రకృతి వ్యవసాయం ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జడ్.వెంకటేశ్వరరావు, ప్రకృతి విభాగం డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు మేనజరు నూక రాజు సూచనలతో చినమల్లంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న వరి చేలల్లో వ్యవసాయ శాఖ 80 శాతం రాయితీలో అందించిన డ్రోన్‌తో 18 రకాలు బయోకల్చర్స్, కోడి గుడ్లు, నిమ్మరసం కలిపి 15 మంది రైతులకు 30 ఎకరాల్లో స్ప్రేయింగ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు బొక్కా ఏడుకొండలు, డివిజన్ ఇన్‌చార్జి వీరన్న గౌడ్, ఎంటీ ప్రేమలత, మండల ఇన్‌చార్జి ఆదినారాయణ, కె.నరేష్, శ్రీదేవి, గిరి రవీంద్ర పాల్గొన్నారు.

జిల్లాలో యూరియా కొరత లేదు

తాడేపల్లిగూడెం: జిల్లాలో యూరియా కొరతలేదని వ్యవసాయ శాఖ జేడీ జెడ్ వెంకటేశ్వరరావు తెలిపారు. క్రిబ్‌కో కంపెనీ నుంచి మంగళవారం గూడెం రైల్వేస్టేషన్‌కు వచ్చిన యూరియా దిగుమతిని ఆయన వ్యవసాయశాఖ అధికారులతో కలసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిబ్‌కో కంపెనీ నుంచి జిల్లాకు 794 టన్నుల యూరియా వచ్చిందన్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో ఈ సార్వాలో 2.09లక్షల ఎకరాల్లో వరి సాగు, 25వేల ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు అవుతున్నాయి. దీని కోసం జిల్లాకు మొత్తంగా ఈ సీజన్‌లో 21,270 టన్నుల యూరియా అవసరం కాగా, ఇప్పటి వరకు జిల్లాకు 19,500 టన్నుల యూరియా వచ్చిందన్నారు. ర్యాక్ పాయింటు వద్ద జేడీతో పాటు, తాడేపల్లిగూడెం సహాయ వ్యవసాయ సంచాలకులు ఆర్.గంగాధర్, గూడెం మండలం వ్యవసాయాధికారి వి.నారాయణరావు, మార్కెఫెడ్ జిల్లా మేనేజర్ గుప్త ఉన్నారు.

అక్షరాంధ్రపై అవగాహన

ఉండి: నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చేందుకు నిర్వహించే అక్షరాంధ్ర కార్యక్రమంపై ప్రతిఒక్కరూ అవగాహనతో ఉండాలని జిల్లా నోడల్ అధికారి కేవీవీ సత్యనారాయణ అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో ఉల్లాస్ అక్షరాంధ్ర అక్షరాస్యతా కార్యక్రమంపై డ్వామా ఇచార్జ్ ఏపీఓ ఓమేగారాజు ఆధ్వర్యంలో వలంటీర్‌లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నోడల్ అధికారి మాట్లాడుతూ మండలంలో డ్వాక్రా గ్రూపుల్లో ఉన్న వెయ్యిమంది నిరాక్షరాస్యులను గుర్తించి వారిలో ప్రతి పదిమందికి ఒక వలంటీర్ చొప్పున ఏర్పాటు చేశామన్నారు. మండలంలో 100 మంది వలంటీర్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అక్షరాస్యతా కార్యక్రమాన్ని సెప్టెంబర్ నుంచి వచ్చే ఏడాది మార్చి వరకు నిర్వహిస్తామని తెలిపారు.శిక్షణ అనంతరం మార్చి నెలాఖరున పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.